# ఇల్లు అంటుకుంది.

రామారావ్ గారింట్లో పార్టీ అవగానే, రాత్రి పదకొండున్నర గంటలకు, స్కూటర్ మీద ఇంటికి బయల్దేరారు సరోజా, శ్రీనివాస్.

శ్రీనివాస్‌కి, రామారావ్‌గారింట్లో భోజనానంతరం జరిగిన సంభాషణ యింకా మెదడును దొలిచివేస్తున్నది.

వాళ్ళింట్లో క్రొత్తగా పరిచయం అయింది అరవింద. చేస్తున్న ఉద్యోగం మానేసి, కమ్యూనిటీ సర్వీస్ చేస్తున్నది అవిడ. భర్త పూర్తి సహకారం, ప్రోత్సాహం యిస్తున్నాడు కూడాను. మతిస్థిమితంలేని పిల్లలకు పాఠాలు చెప్పటం ఆటలు ఆడించటం, వాళ్లకు ఆత్మస్థయిర్యం, జీవితం మీద ఉత్సాహం కలిగించటం లాటివి చేస్తూ వుంటుంది.

రామారావ్, శ్రీనివాస్ దేశం ఎలా కుళ్లిపోయిందో, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను పీడించి, లంచాలు లక్షల్లో ఎలా గుంజుకుంటున్నారో, రాజకీయ నాయకులు మతాల పేరుతో, కులాల పేరుతో అరాచకం సృష్టించి, ఎలాతమ స్వప్రయోజనాలు పూర్తి చేసుకుంటున్నారో... అన్నీ మాట్లాడుకున్నారు.

"దేశం పాడయిపోయింది మాష్టారూ -- ఎవరూ బాగుచేయలేరిక!" అన్నాడు శ్రీనివాస్.

అప్పుడే అన్నది అరవింద- "అలా అందరూ ఉపన్యాసాలిచ్చేవాళ్లే కానీ, ముందుకువచ్చేదెవరండీ - మనం ఏదయినా ప్రయత్నం చేస్తూన్నామా దేశం బాగుపడటా

నికి"

"అఁ! మనవల్ల ఏమవుతుంది - పెద్ద పెద్ద వాళ్ళు ఏంచేయలేకపోతున్నారు" అన్నాడు రామారావ్.

"మంచి కానీ, చెడు కానీ, ఎప్పుడూ ఒకే మనిషి దగ్గర మొదలవుతుంది అని ప్రపంచ చరిత్ర చాటి చెబుతున్నది. ఎక్కడినించో ఎవరోవచ్చి మనల్ని రక్షించరు - మన వీధులు, ఊరు, దేశం, జీవితం బాగుచేయరు. మన బాగోగులు మనవే చూసుకోవాలి! అందరు - మన మందరం ముందుకు రావాలి" అన్నది అరవింద.

శ్రీనివాస్ నవ్వాడు - "అవన్నీ జరిగే పనులు కావండీ - అరాచకం బాగుచేయలేనంతగా పాడయిపోయింది మనదేశంలో -- ఎవరూ రక్షించలేరు!"

అరవింద అన్నది - "మనమే వాళ్ళకు లంచాలు యిస్తున్నాం - ఓట్లు వేసి గెలిపిస్తున్నాం - మన వీధులను మనమే చెత్తతో నింపేస్తున్నాం, దేశమంతా పిల్లలతో నింపేస్తున్నాం - సమ్మెలు చేసి బస్సులూ, బిల్డింగులూ తగలేస్తున్నాం - అవన్నీ మనమే చేస్తున్నప్పుడు, వాటిని ఆపటం కూడా మన వల్లనే అవ్వాలి. మనం ఏమీ చేయకుండా దేశాన్ని, తిడుతుంటే ప్రయోజనం వుండదు. నేను మీతో వాదించదలుచుకోలేదు. కానీ ఒక్కసారి - ఈ నెగెటివ్ ఆలోచనలు ఆపి ఆలోచించండి. మీరు ఎంత చేయగలరో మీకే అర్థం అవుతుంది"

శ్రీనివాస్‌కి తనమిత్రులతో చాల చోట్ల ఈ విషయాల మీద వాదోపవాదాలు చేయటం అలవాటే. కానీ ఆవిడ ఏమీ వాదించకుండా, తను చెప్పవలసింది సూటిగా చెప్పి, మిగతాది తన ఆలోచనలకు వదిలి వేయటం చాలా ఆశ్చర్యంగా వుంది అతనికి.

స్కూటర్ సత్యనారాయణపురం వేపుకు త్రిప్పాడు శ్రీనివాస్. అప్పుడే చూశాడు. అక్కడ కొన్ని గుడిశెలు వున్నాయి. తన ఇంటికి చాలా దగ్గరలోనే ఎవరో నిర్లక్ష్యంగా, ఆ గుడిశెల ముందర గడ్డిమీద సిగరెట్టు పడేసినట్టున్నారు. అప్పుడే మంటలు మొదలవుతున్నాయి. ఆ గుడిశెల్లో అందరూ నిద్రపోతున్నట్టున్నారు. ఎక్కడా కదలిక లేదు.

సరోజ అన్నది - "ఏమండీ - ఇప్పుడే అంటుకున్నట్టుంది - వాళ్ళను లేపండి - ఫైర్ ఇంజన్ని పిలవండి-" అని--

"మనకెందుకు సరోజా - లేనిపోని గొడవ --" శ్రీనివాస్ స్కూటర్ ఆపలేదు.

"మనకెందుకు అని వూరుకుంటే ఎలాగండీ - ఇళ్ళు, ఇళ్ళల్లోని మనుషులు తగలబడతారు - స్కూటర్ ఆపండి!" సరోజ ఈసారి గట్టిగా అన్నది.

శ్రీనివాస్ స్కూటర్ ఆపాడు. ఇద్దరూదిగారు - "అక్కడ కుండలో నీళ్ళు వున్నాయి - ఆ మంటల మీద పోయండి!" సరోజ అన్నది. అంటూనే ఆ గుడిశె తలుపు మీద బాదింది.

"గుడిశెలంటుకున్నాయి లేవండి - "అని అరిచింది. ప్రక్క గుడిశెల తలుపు మీద కూడా దబదబా బాదింది.

అందరూ హడావిడిగా లేచారు. ఇద్దరూ అక్కడే బావిలోని నీళ్ళు తోడుతున్నారు.

మిగతా వాళ్లు అందుకుని నీళ్ల మంటల మీద పోస్తున్నారు. చిన్నా, పెద్దా, ఆడా, మగా, హిందూ, ముస్లిమ్, ఈ కులం, ఆ కులం అన్నీ తేడా లేకుండా అందరూ, వాళ్ళ యిళ్ళు కాపాడుకోవటానికి శాయిశక్తులా ప్రయత్నిస్తున్నారు.

వాళ్ళల్లో ఒకతను దగ్గరలోవున్న హోటల్‌కి వెళ్ళి, ఫైర్ యింజన్ వాళ్లకి ఫోన్ చేశాడు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపలే, మంటలు అన్నీ ఆర్పేశారు అక్కడ వున్న వాళ్ళంతా. మంటలు పూర్తిగా ఆరిపోయాయి.

అక్కడ నుంచుని, ఫైరింజన్ ఆలస్యంగా వచ్చిందని ఎవర్నో నుంచోబెట్టి, సుత్తికొడుతున్న శ్రీనివాస్‌తో అన్నది సరోజ "పదండి - వెడదాం" అని శ్రీనివాస్ యింటి తాళం తీస్తుండగా అన్నది సరోజ - "ఇందాక అరవింద చెప్పింది యిదే - మంచీకానీ, చెడుకానీ ఏదన్నా ప్రారంభం జరిగేది ఒక్క మనిషి వల్లనే. ఎవడో ఒక్కడు, ఆ సిగరెట్టు గడ్డి మీద పారేసి నిప్పు అంటించాడు. మనం చూసికూడా, మనకెందుకులే అనివూరుకుంటే - ఆ గుడిశెలన్నీ తగలబడాలి - వాళ్ళకి వున్న ఆ కాస్త నీడా కరువయేది. అంతేకాదు ఆ మంటలు వ్యాపించి, మనపేటంతా తగల బడేది. మన యిల్లు కూడా మట్టిలో కలిసిపోయేది. మనమేదో గొప్పపని చేశామని చెప్పటంలేదు. ఈ సమాజంలో పౌరులుగా మన బాధ్యత మనం చేశాం"--

సరోజ వేపు వింతగా చూశాడు శ్రీనివాస్

ఆమెను దగ్గరకు తీసుకుని, ఆమె నుదిటి మీద ముద్దు పెట్టుకున్నాడు -

"అవును సరోజా - నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. నిజానికి నువ్వు కానీ, నేను కానీ చేసింది ఏమీ లేదు. వాళ్ళ యిళ్ళకు మంటలు వాళ్లే ఆర్పుకున్నారు. ఈ మంచిపని నీతో మొదలయింది. నన్ను నిద్ర లేపావ్. మనం వాళ్ళని నిద్ర లేపాం. ఇదే మనం మన దేశానికి ఎందుకు చేయటంలేదు? - నావల్ల అవుతుందా అని ఎందుకు ఆ నిరుత్సాహం. ఆ నిరుత్సాహంతో ఏమీ చేయలేదని మిగతా వాళ్ళని అడుగుతూవుంటే ఎలా? ఇది మన వల్లే అవుతుంది. మన వల్లే అవ్వాలి. మన ఇల్లు మనం కాపాడుకోగలిగినప్పుడు, మన ఊరుని, మన దేశాన్ని, కాపాడుకోలేమా? మనం ఫైరింజన్ కోసం ఎదురుచూడకుండా మంటలు ఆర్పేయగలిగాం. మరి మిగతా పనులు, ప్రభుత్వం మీద ఆధారపడకుండా ఎందుకు చేయటంలేదు? - మన బాధ్యతలు వదిలి ఎవరోవచ్చి మనల్ని ఉద్ధరిస్తారని, ఎందుకు కాల జాప్యం చేస్తున్నాం?"

సరోజ అన్నది - "అవును - ఇందాక అరవింద చెప్పిందే అది - దేశం మనకేం చేసింది అని కాదు అడగవలసింది. ఈ దేశానికి మనమేం చేశాం అని. మనం దేశానికి ఏమీ చేయనప్పుడు మిగతా వాళ్లని ఏమీ చేయలేదని విమర్శించే అర్హత లేదు మనకు!"

కాసేపాగి మళ్లీ అన్నది- "అరవిందతో మాట్లాడుతాను. మన రోడ్లన్నీ చెత్తా చెదారంతో మహా దరిద్రంగా వున్నాయి. కనీసం ఒక పది మందిని ప్రోగు చేసి, ముందు మన రోడ్డు శుభ్రం చేసి పని మొదలు పెడతాను! కనీసం వారానికి రెండు రోజులు, ఎవరి ఇంటి ముందు వాళ్ళు శుభ్రం చేసుకుంటే - దేశం అంతా బాగుపడుతుంది!"

శ్రీనివాస్, సరోజని ప్రేమగా చూసి తలవూపాడు.